మ్యాగజైన్ కొనుక్కుని ఇటు తిరిగిన రాధకు, ఎదురుగుండా మెడికల్ షాపులో మాధవరావ్ కనిపించాడు.

ఆమె కన్నులు మెరిశాయి. పెదవులపై చిరునవ్వు హృదయాంతరాళాలలోని ఆనందానికి సూచకం!

వికసించిన పుష్పంలా ఆమె పెదవులు అతని పేరుని ఉచ్చరించాయి— 'మాధవ్' అని!

ఎన్నాళ్ళ కిలా కనిపించాడు! ఈ రోజెంత శుభదినం! అతని ఆకృతిని ఆకళింపు చేసుకో సాగింది.

మనిషిలో పెద్ద మార్పులేదు. కానీ, మొహంలో ఆనాటి కళ లేదు. ఎందుచేతనో అంతలో మనసులో తెలియని బాధ!

రోడ్డు క్రాస్ చేసి ఇవతలకు వచ్చింది— అతనితో మాట్లాడాలని.

మాధవరావ్ మందులు నిండిన చేతులతో, తల వంచుకుని షాపులోంచి దిగుతున్నాడు.

అతనికి అడ్డం వచ్చి నిలిచినట్టు నిలబడింది రాధ.

'గుర్తున్నానా?' అని మంద స్వరంతో అడిగింది.

అతను చటుక్కున తలెత్తి చూశాడు. క్షణం అలా చూస్తూ నిలబడ్డ తర్వాత, 'మీరు.. మీరు రాధాకుమారిగారు కదూ?' అని అడిగాడు.

గుర్తు పట్టినం సంతోషంతో రాధ మనసు నెమలిలా పురివిప్పి ఆడింది. నిండుగా నవ్వుతూ, 'థాంక్స్ గుర్తు పట్టరేమోనని భయపడ్డాను. గుర్తుపట్టేశారు. మీరు కూడ ఇక్కడ ఉంటున్నారా?'

'అంటె మీరూ ఇక్కడే ఉంటున్నారా?'

అతని ఎదురు ప్రశ్నలో, తనకు కావలసిన జవాబు దొరికేసింది రాధకు.

'చాలా సంతోషం. ఇలా రోడ్డు మీద ఎంత సేపు? రండి మా ఇంటికి— సంగతులన్నీ విచారించుకోవచ్చు.' అని ఆహ్వానించింది. చూసీ చూడగానే ఇంటికి రమ్మని పిలిచేయటంతో, కాస్త తడబడ్డాడు మాధవరావు.

'ఇప్పుడు కాదులెండి. త్వరగా ఇంటి కెళ్ళాలి. మరోసారు వస్తాను' అన్నాడు చేతిలో మందులకేసి చూసుకుంటూ. రాధ కూడ వాటివంక చూసింది.

''ఎవరికీ అన్ని మందులు?'' ఆ ప్రశ్నలో ఆమెకే తెలియని ఒక భావం ఇమిడి ఉంది.

''నా భార్యకు'' అసంతృప్తిగా పలికిం దాతని కంఠం.

'ఓహో' ఆమె మనసులో కూడ అదో రకమైన అసంతృప్తి.

''పిల్లలెంత మంది? ఇంతకీ ఆవిడ జబ్బేమిటి?'

ఆ ప్రశ్నలకు నవ్వొచ్చింది మాధవరావ్‌కి. కష్టాల్లో కూడ నవ్వగలిగే ధీరుడిలా ఒకసారి నవ్వాడు.

'ఆమె జబ్బు ఒకటని చెప్పలేనండి. కడుపు నొప్పి గుండెనొప్పి. నరాల బలహీనత, రక్తహీనత... ఇక పిల్లలంటారా? వాళ్ళు పుట్టకుండా అదృష్టవంతులైయ్యారు.'

మాధవరావ్ అలాంటి మాటలంటున్నప్పుడు కూడ, అతని పెదవులపై నవ్వు లీలగా మెదిలింది. కానీ, ఆ నవ్వు సంతోష సూచకం కాదు. రకరకాల నవ్వుకీ, మనసుకీ ఉన్న అవినాభావ సంబంధం పసి గట్టడం కొంచెం కష్టమైన పనే.

రాధ అతన్నే అయోమయంగా చూస్తూ నిలుచుంది. కాసేపట్లో అతని మీద ఆమెకు జాలి పుట్టుకొచ్చింది. క్షణంలో ఆమె మస్తిష్కంలో ఏవేవో భావాలు, ఊహలు!

'మీ ఇల్లెక్కడ?' అని అప్రయత్నంగా అడిగింది.

అతను చెప్పాడు.




''వస్తానులెండి'' అని కదిలింది.

అతనూ కదిలాడు. ఆమె అటు, అతనిటు, వారి దారులు వారిద్దరి మధ్య దూరాన్ని పెంచుతున్నాయి.

కానీ, రాధ మనసు మాత్రం అతనికి చేరువ కావాలని చూడ సాగింది.

ఇంటి కొచ్చింది. ఇల్లంతా ఒక మూటు కలియ జూసింది. బ్రహ్మచారిణి కొంప— కళా విహీనంగా కనబడింది. ఈ ప్రపంచంలో తన కెవ్వరూ లేనట్టు, ఆ ఒక్క గదిలో తనొక్కదాన్ని విసిరేసినట్టు బ్రతుకు గడుపుతానాలది. ఎందుకీ బ్రతుకు? అని అనుకున్నప్పుడల్లా ఆవేదనా పారవశ్యం తనని ముంచెస్తుంది. కానీ, చావలేక బ్రతికేస్తుంది.

అన్నం తినాలనిపించలేదు. తినక పోయినా, తన కోసం బాధపడే వాళ్ళెవ్వరూ లేరు. ఈ ఆలోచన వచ్చినప్పుడు, ఆ మరణ నిరాహార దీక్ష పూనాలని పిస్తుంది. అదీ చేయనేరదు. ఏదో బలహీనత, తాను కున్న పనేదీ తన చేత చేయించదు. బట్టలన్నా మార్చుకుండా అలాగే మంచం మీద వాలింది నిరాశగా. వస్తూ వస్తూ తెచ్చుకున్న పుస్తకం తెరచింది. ఒక చిన్న కథ— అది కూడ బుర్రకెక్కటం లేదు! మూసి పక్కన పడేసింది. పక్కకు తిరిగి

కళ్ళు మూసుకుంది. నిద్రరాదు. గతంలోకి ఒరిగిన్న పరుగు.

కాలేజీ చదువులు సాగుతున్నప్పుడు, మాధవరావ్ తన క్లాస్‌మేట్. ఇద్దరూ చదువులోనే కాకుండా, మిగిలిన కాలేజీ కార్యక్రమాల్లో కూడా పోటీల మీద జోడు గుర్రాల్లా ఉండేవారు.

అప్పటి ఆ తెలివి తేటలు, చురుకుదనం—జీవితంలో తన కెలాంటి మాధుర్యాన్నీ అందివ్వ లేక పోయింది. ముందరే తెలిసి ఉంటే, అంత చురుగ్గా ఉండేది కాదేమో! మనసు అసంతృప్తిగా మూలిగింది.

అప్పట్లో, ప్రతిచోట తన కెదురయ్యే మాధవరావంటే ఆదో రకమైన అభిమానం ఏర్పడింది. అతన్ని తన మనసు

మాటి మాటికీ ఆహ్వానించేది. తాను గెలిస్తే ఎంత ఆనందంగా ఉండేదో, అలాగే తనోడి—అతను గెలిచినా అంత ఆనందం. తానతన్ని ఆరాధించింది. కానీ, బయట ఎవ్వరికీ తెలియదు. ఆ పరిధి—తన మనసు వరకే.

అంత సుహృదు ఏమున్నదో, అతని ధ్యాసలో పన్ను నేను మరిచేందుకు? అని తలపోసి తనలో తాను నవ్వుకునేది.

అంతలో పరీక్షల హడావిడి. రాత్రింబవళ్ళు విశ్రమాని చదువులు. పరీక్షలై పోయాయి. సెలవులూ వచ్చేశాయి.

ఈ మధ్య కాలంలో అతన్ని కలిసే అదను దొరకలేదు. చూసే తీరిక చిక్కలేదు.


ఆ తర్వాత తానెటో!, అతనెటో!

ఆరాధన తాత్కాలికంగా ఆగిపోయింది.

పదేళ్ళ కాలం గడిచి పోయింది. తాను అవివాహితగానే మిగిలి పోయింది. అతని గురించే మీ తెలియదు.

తీర్థయాత్రలకని బయలు దేరిన తల్లిదండ్రులు రైలు ప్రమాదంలో పరలోక యాత్ర చేసేశారు. విద్యుద్ఘాతంలాంటి ఆ సంఘటనకు తాను స్తంభించి పోతే అన్నయ్య తీసుకెళ్ళి తన ఇంట్లో పడేశాడు. అక్కడ తనకూ, వదినకూ పొత్తు కుదరలేదు. అన్నయ్య వదిన్ని వెనకేసు కొచ్చేవాడు. అలాటి సందర్భాలలోనే అనిపించేది. నా కంటూ ఇలాంటి మనిషొకరుంటే! అని గుండె బరువుతో, పిచ్చిగా రోదించింది. ఏదో స్వర్గం చేజారి పోయినట్టు విలపించింది. ఇక వాళ్ళ మధ్య అలా ఉండాలని పించలేదు. ఒక ఉద్యోగం చూసుకుంది. దూరంగా వచ్చేసింది. ఈ రకంగా గడుపుకొస్తోంది.

పెళ్ళి! పెళ్ళంటూ తనకు తగిన వయసులో జరిగి ఉంటే, మనస్సింతగా కుంగిపోయేది కాదేమో. కానీ, తన పెళ్ళి ఎవరు చేస్తారు? చివరికి తనకు తానే కూడ చేసుకోలేక పోయింది. అయినా, పెళ్ళి మీద మోజు తీరలేదు. ఇప్పుడు, ఇన్నేళ్ళకు మరలా మాధవరావ్ కనిపించాడు. ఎందుకు కనిపించాడు? అని ప్రశ్నించుకుంటే, దానికీ ఏదో కారణం ఉండే ఉంటుందని ఆమె మనసు జవాబు చెప్పింది. ఆ కారణాన్ని తనకు తోచినట్టుగా తలపోస్తూ, క్షణిక పారవశ్యానికి లోను కాసాగింది రాధ.




ఒకనాడు, ఉండబట్టలేక, మాధవరావ్ ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళింది.

అతనింట్లో లేడు. అతని భార్య మంచంమీది నుంచే చిరునవ్వుతో ఆహ్వానించింది.

'మీ గురించి ఆయన చెప్పారు. మీ రాక కోసమే ఎదురు చూస్తున్నాను. మీ పేరు రాధ కదూ!' అని పలకరించింది నిశ్చయించుకున్న తర్వాత ఒకచిన్న అనుమానం వచ్చిన దానిలాగ.

ఆమె కలుపుగోలు మాటలకు రాధ కొద్దిగా తడబడింది.

"ఆ నేను రాధేనండి" అంది ఒక్క క్షణం ఆగి.

కొంతసేపు నిశ్శబ్దం తర్వాత, 'ఆయన ఇంట్లో లేరా?' అని మళ్ళా తానే అడిగింది.

"లేరు" అంటూచూపులు దించుకున్న శ్రీమతి ముఖంలో కొద్దిగా నిర్వేదం చోటు చేసుకుంది.

అది గమనించింది రాధ. ఎందుకో, మాధవరావ్ త్వరగా వస్తే బావుణ్ణనిపించింది.

"ఏం పని మీద వెళ్ళారు? రావటానికి ఆలస్యమవుతుందా?" అడిగింది మళ్ళా.

శ్రీమతిని ఏడిపించాలని ప్రశ్న వేయలేదు కానీ, ఆ మాటలు విన్న ఆవిడ కన్నుల్లో కన్నీళ్ళు తిరిగాయి.

"ఆయనకింక వేరే పనేముంది. దురదృష్టం. ఎప్పుడూ నా గురించి, డాక్టర్లు, మందుల షాపు, ఎక్స్‌రే క్లినిక్‌ల చుట్టూ తిరగటమై పోయింది. ఎందుకో నా కోసం ఇంకా పాకులాడు తున్నారు!' రుద్ధ కంఠంతో పలికింది. జలజల కారిన కన్నీళ్ళు వత్తుకుంది.

రాధ కీ ధోరణి అసహనంగా తోచింది. పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్టు మాట పెగల్లేదు.

ఒక రోగిష్టి, మానసిక బలహీనురాలు, సాటిస్త్రీ అలా దుఃఖిస్తుంటే, నిజానికి తనామెను ఓదార్చాలి. కానీ, మనసలా ఆలోచించటం లేదు. ఒక వేళ, ఆమే తన ఆత్మీయురాలై, ఆమె భర్త ఎవరో తెలియక పోతే, మనసు మెత్తబడేదేమో. ఓదార్చేదేమో. కానీ, ఇప్పుడు ఇక్కడ తన ఆత్మీయుడు మాధవరావ్!

రోగిష్టి భార్యవల్ల అతని జీవితం పాడై పోయిందే నని, అతని పట్ల జాలి కలుగుతోంది. తన ఓదార్పంతా అతనికే అన్నట్టుంది. పైపెచ్చు శ్రీమతి మనోభారంతో అంటున్న మాటలన్నీ నిజాలుగానే కనబడు తున్నాయి. అదే స్థానంలో తానుంటే, అతని బ్రతుకెంత మెరుగ్గా ఉండేది?! ఈ ఆలోచనని అరికట్ట లేక పోయింది రాధ.

మౌనంగా ఉండి పోయింది.

బాధనంతా వెళ్ళ గ్రక్కి, ఒక్కసారి ఏడ్చేయగానే బరువు దిగినట్లైంది శ్రీమతికి. చప్పున తనని తాను సంబాళించు కుంది. 'అయ్యో నా గురించి చెప్పుకుని మిమ్మల్ని కూడ బాధపెట్టి నట్టున్నాను. ఉండండి కాఫీ తెస్తా'నని లేవబోయింది.

'వద్దొద్దు. మీరు లేవకండి. నేను కాఫీ త్రాగే వచ్చాను. అని వారించింది రాధ.

ఆమె మంచం దిగేలోపునే మాధవరావ్ వచ్చేశాడు. ఇద్దరూ అతన్నే చూస్తుండి పోయారు. అతను రాధని చూసి, ' ఎప్పు డొచ్చారు రాధ గారూ? ఇల్లు సులువుగా తెలుసు కున్నారా?' అని అడిగాడు.

'ఆ తొందరగానే కనిపెట్టేశాను. తీరా వస్తే మీరు లేరు ఇంట్లో' అంది.

దానికి జవాబుగా రాధ కో చిరునవ్వందించి, భార్యని చూశాడు.

'కాఫీ తెస్తానంటే వద్దంటున్నారు చూడండి. ఆ మాత్రం పని కూడ చేయలేనా నేను?' తన బలహీనతకు నొచ్చుకుంటున్న దానిలా ఫిర్యాదు చేసింది శ్రీమతి మాధవరావ్‌కు.

ఇలాగే ఒకమాటు ఆమె పొయ్యి దగ్గర కెళ్ళి, కళ్ళు తిరిగి పడిపోయిన సంగతి గుర్తు కొచ్చిందతనికి. అదృష్టం బాగుండి ఏ ప్రమాదమూ జరగలేదు. మళ్ళా ఆమె పొయ్యి దగ్గర వెళ్ళటం ఇష్టం లేదతనికి. ఆ మాట చెప్ప వారిద్దామంటే, రాధ ముందు భార్యను కించ పరచటం అవుతుందేమో ననుకున్నాడు. అందుకే, ' ఎందుకులే శ్రీమతీ! మీరిద్దరూ కబుర్లు చెప్పుకుంట

ఉండండి. చిటికెలో కమ్మని కాఫీ చేసి నేను తెస్తాను.' అంటూ, మందులామె కందించి, అలసటని కూడ లెక్క చేయకుండా వంటింట్లోకి వెళ్ళాడతను.

అతనలా చేయటం, రాధ కెలాగో అనిపించింది. అసంతృప్తి, అదోరకమైన బాధ ఆమె పొందింది. మాధవ్ తనతో కూర్చుని సరదాగా మాటాడుతాడనీ, భార్యకన్నా ఎక్కువగా తనని చూస్తాడని అనుకుంది. ఆశించింది. కాని, ఇది నచ్చలేదు. ముళ్ళమీద ఉన్నట్టుగా ఉంది. వెళిపోదామని సగం మనసు, వద్దని సగం మనసు!


గోడకున్న రాధా మాధవుల్ని తదేకంగా చూస్తూ కూర్చుంది కానీ, రాధ విరహిణి, ఆ సటం ఆమె వూహా చిత్రం!

ఐదు నిముషాలు గడిచాయి.

"కాఫీ తీసుకోండి" అన్న మాధవరావ్ గొంతుకకి ఇహాని కొచ్చింది.

అప్పటికే, శ్రీమతి కాఫీ తాగుతూంది. తానూ అందుకుంది..

క్షణం అతని చూపుతో తన చూపు కలిసింది. మనసులో ఏవో అలల సుడి గుండాలు!



వైరం — ఎల్. ఆర్. గ్రోవర్ (రోహతక్)

తమాయించుకుని, "మరి మీకు?" అని అడిగిం దతన్ని.

"ఇదుగో" అంటూ టీపాయ్ మీదున్న మరో కప్పు అందు కున్నాడు.

ఇద్దరాడ వాళ్ళున్నా, అతను కాఫీ చేసి అందిస్తున్నాడు.

వేడి కాఫీ ఆమె మనసుని వెన్నెలా కరగించింది. ఎందుకో ఇక ముందతనికి తానన్ని విధాలా సహాయకారిగా ఉండాలని పించింది.

మాటలంత రక్తిగా సాగలేదు.

"వస్తానండి" అని లేచింది.

"అలాగే వస్తూ ఉండండి" అంది శ్రీమతి. తమ ఇంటో తమిద్దరినీ ఉత్తేజ పరచటానికి మూడో మనిషి కావాలని ఆమె ఆకాంక్ష!

మాధవరావ్ ఆమెతో గుమ్మందాక వచ్చాడు.

'వెళ్ళొస్తాను మాధవ్' అని ఆమె అనలేదు. ఆమె 'వస్తానండి' అంది ముక్తసరిగ్గా.

"ఆ వస్తూ ఉండండి. మా శ్రీమతికి కాస్త ధైర్యం చెప్పగలరేమో!" అన్నాడు మాధవరావ్.

ఆ రెండో మాటే ఆమె కంఠ పలికించలేదు.

కానీ, ప్రస్తుతం తన మనసుకి కావలసినది అతని ఆహ్వానం. అదే కారణం చేతనైనా ఫరవాలేదని సరి పెట్టుకుంది.

"అలాగే" అని వెళ్ళిపోయింది.

అలా మొదలైంది, మాధవరావ్ ఇంటికి ఆమె రాకపోకలు. తనకు తెలియకే, ఆమెకా ఇంట్లో స్వేచ్ఛ పెరగసాగింది.

నిర్మలమైన మనసుతోనే మాధవరావ్ దంపతులు ఆమె నాదరించేవారు.

రాధ వచ్చినప్పుడల్లా, వంటింటి పని తనే చేసి ముగించేది. అలా చేస్తున్నప్పుడు, తనకు సంక్రమించిన ఒక హక్కులా భావించేది ఆమె మనసు. తన వల్ల మాధవరావ్‌కి కొంత బరువు తగ్గిందంటె, అదే ఆమెకెంతో తేలిగ్గా ఉంది. అనిర్వచనీయమైన ఆనందాన్ని అందించింది. అలా రోజులు సాగుతున్నాయి.

శ్రీమతి ఆరోగ్య విషయంలో మెరుగేమీ కనిపించలేదు. అతని సుఖం డబ్బు అంత వృధా అయిపోతున్నట్టు బాధ పడింది రాధ. రోగికి ప్రాణ మున్నంత వరకూ పండుటాకు పోషిస్తారు. కానీ. ఆ ప్రాణానికి విలువనిచ్చిన వ్యవధి మట్టుకు తక్కువే. ఆమెకున్న అనారోగ్యంతో ఆమెకు దిన దిన గండం! పూర్ణాలు పచ్చిలా గడుస్తున్నాయి రోజులు. రాధకేదో అసహనంగా ఉంది. ఎందుకో తాను వేచివున్న దానిలాగ, ఆ ఫలానికి అనిడ అడ్డు తగులుతున్న దానిలాగ ఆరాటం పెరుగుతూంది. ఆమె మీద ద్వేషకమైన ఏహ్యం జనిస్తుంది. మాధవరావ్ పట్ల తనకున్న సానుభూతికి, ఏదన్నా చేసి, ఒక మార్పు తేవాలని — ఆ తరుణం కొసం ఎదురు చూస్తున్న దానిలా అయిపోతూందామె. తను అనుకున్నట్టు జరిగితే, మాధవరావ్ బాధా విముక్తుడవుతాడని, ఆ తర్వాత తాను అతనికి సర్వ సుఖాలందించి, అతన్ని అలరించ వచ్చునని ఆలోచనలు సాగిపోతున్నాయి.

కానీ, ఎంతకూ తానెదురు చూస్తున్న క్షణమే రావటం లేదు.

ఒకనాడు, బజార్లో కలసిన మాధవరావ్‌ని బలవంతంగా తన ఇంటికి పిలుచు కొచ్చింది.

అతను రాగానే, తన గదికి ఇన్నాళ్ళు లేని ఒక కళ వచ్చినట్టు తోచింది.

టిఫిను పెట్టి హార్లిక్స్ ఇచ్చి అతన్ని సత్కరించింది. అది తన కర్తవ్యంగా, తన బాధ్యతగా భావించింది. మనసులో వచ్చే తన ఆలోచనల్ని అతని ముందు పరచాలని మనసు తొందర పడుతూంది.

'మాధవ్! ఒక మాట' అంటూ అర్ధోక్తిలో ఆగిపోయింది. మరుసెకనుకో ముందు వెనకలుగా వూగులాడు తూంది.

మాధవరావ్‌కి ఆమె ధోరణి కొంత విస్మయాన్ని కలిగించింది.

"రాధగారూ! చెప్ప దలచుకున్నదేదో చెప్పండి" అన్నాడు.

'మిమ్మల్ని అపార్థం చేసుకొంటాంటె. . .'

"అంత మన్నించలేని విషయమైతే. . . ."

"మాట్లాడుకొనే అవకాశం లేదంటారా? కానీ, మీతో నా మనసులో మాట చెప్పకుండా ఉండలేక పోతున్నాను."

"అయితే చెప్పెయండి."

రాధ తన నిర్ణయాన్ని అతని కళ్ళల్లోకి చూస్తూ 'మీ భార్య గురించి నా అభిప్రాయం'"

రాధ పోకడ మాధవరావ్‌కు అర్థం కాలేదు. అయినా అడిగింది కాబట్టి చెప్పాలి.

"శ్రీమతి...సౌమ్యురాలు. నేనంటే ఆమెకు ప్రేమ, గౌరవం, ఇంకా చెప్పాలంటే నన్ను, 'మీరే నా ప్రాణం' అంటుంది. అందుకే ఎన్నిపాట్లు పడైనాసరే తన ప్రాణం నిలుపుకోవాలని అనుకుంటుంది. తన అనారోగ్యం సంగతి తనకు తెలియదు కానీ, ముసలతలా నా బాధ్యత వహించాలనే ఎదురు చూస్తూంది. నిర్మలమైన ఆ ప్రేమమూర్తిని అందుకే నేనెప్పుడూ బాధించటానికి ఇష్టపడను. సంతోషపెట్టటానికి నా శాయశక్తులా పాటుపడుతున్నాను. కానీ, ఆమె ఆయుర్దాయం చాల చిన్నదన్న డాక్టర్ల మాటని ఏ విధంగా అబద్ధం చేయాలో నా కర్థం కావటం లేదు." మాధవరావ్ ఆ మాట అంటుంటే ఖిన్నుడైపోయాడు. అతని కనుదోయిలో కన్నీటి పొర నిలచింది.

'మాధవ్' రాధ కంఠం వణికింది. మవునంగా ఆమెను చూశాడు మాధవరావ్. రాధ కన్నుల్లోకూడ తడి!

'మాధవ్! బాధ పడకు. శ్రీమతి నీ జీవితం నుంచి నిష్క్రమించిననాడు, ఆ స్థానంలోకి నేనొస్తాను. నిన్ను సుఖపెడతాను'—ఆవేశ పూరితంగా అనేసింది రాధ.

ఆశ్చర్యపోయాడు మాధవరావ్. ఆమె మనసులో ఉన్న ఆలోచన యిదని అత నూహించనేలేదు. 'రాధా' అంటూ చటుక్కున లేచి నిలబడ్డాడు.

రాధ ఇంక సంశయించదలచుకోలేదు. తన మనసు అతని ముందు పరిచేసింది.

'అవును మాధవ్! మొట్టమొదటిసారి నిన్ను కాలేజీలో చూసినప్పుడే నా హృదయం నీ కర్పించేశాను. కానీ, మన దారులు వేరై పోయాయి. నా హృదయం నీదే, నా ఆరాధన నీదేనని నా కీనాడు స్పష్టంగా తెలిసిపోయింది. ఇప్పుడు నీకో భార్య వుంది. కానీ, ఆమె నీతో చిరకాలం వుండదు. ఆ తర్వాత ఆ

స్థానాన్ని అందుకోవాలని నా మనసు ఉబలాట పడతోంది. ఆ నాటి నా ఆరాధన, ప్రేమ ఫలించే అవకాశం కోసమే దేవుడు మనల్ని మరలా కలిపాడని మనసు చెబుతోంది. నాకీ ప్రపంచంలో నీవు తప్ప ఇంకెవ్వరూ లేరని తీర్మానించేశాను. కాదనకు మాధవ్! నన్ను, నా కోరికనూ మన్నించు.''

మాధవరావ్ మనసు కుడితిలో పడ్డ ఈగలాగ తన్నుకోసాగింది. ఏమిటి పరిణామం! స్నేహధర్మంగా నిర్మలమైన మనసుతో రాధని ఆహ్వానించి, ఆదరిస్తే ఇది దేనికి దారి తీస్తోంది?


అటు తన శ్రీమతి దీన వదనం! ఇటు రాధ భిన్న వదనం! ఇద్దరూ స్త్రీలే. ఇద్దరూ తనకోసం తపించే వాళ్ళే. మాధవరావ్ అని పేరు పెట్టుకున్నందుకా తనకీ అవస్థ? ఇప్పుడు తనేం చెయ్యాలి? రాధని మన్నిస్తే, తన అర్ధాంగి శ్రీమతి చావుకోసమే ఎదురు చూస్తున్నట్టు కాదూ! అయినా, ఆమె తనతో చివరి దాక నడుస్తుందన్న ఆశలేదు. అది తేలిపోయిన తర్వాత, రాధ అభ్యర్థనని కాదని ఆమెను శోక సముద్రంలో ముంచటమెందుకు? చిక్కు సమస్య. ఒక్క రోజులో ఇంతలా తల బ్రద్దలయ్యే సమస్య తన ముందు నిలుస్తుందని తాను అనుకోనేలేదు. అక్కడ నుంచి కదలబోయాడు.

'మాధవ్' అంటూ రాధ వెంట వచ్చింది.

'రాధా! వెంట పడకు. ఏది ఎలా జరగాలో ఆ దేవుడే నిర్ణయిస్తాడు. నేనేం చెప్పలేను' అని వచ్చేశాడు.

ఆనాటినుంచీ అర్థంకాని అలజడి. నిశ్చలమైన కొలనులో రాయి విసిరినట్టు—రాధ తాను రావటం మానలేదు. పూర్వంలా వస్తూనే వుంది. తానే దూరంగా ఉంటున్నాడు. శ్రీమతితో ఎక్కువ జోక్యం పెంచుకుంది. మంచిదే అనుకున్నాడు. రోజులు గడుస్తున్నాయి. వారాలు, నెలలుగా. శ్రీమతి ఆరోగ్యంలో మెరుగు లేదు. అతని జీవితంలో శాంతి లేదు. రాధ మనసులో నిలకడ లేదు. ఏదో పోరాటం!

ఒకనాడు రాధ ప్రవర్తన మరీ ఆశ్చర్యంగా తోచిందతనికి. శ్రీమతికి చేయవలసిన సేవలన్నీ తనపై వేసుకుని చేస్తోంది. తాను వద్దని వారిస్తుంటే కూడ, 'ఫరవాలేద'ని చేస్తోంది. మనసు ఏదో పరిణతికి వచ్చిందేమోనని సరిపెట్టుకున్నాడు. రాధ గురించి అతనికే దురుద్దేశమూ లేదు. ఆ రాత్రి తెల్లవారేటప్పటికి శ్రీమతి మూసిన కన్ను మరి విప్పలేదు. ఆ రాత్రంతా కడుపులో ఏదో బాధ పెడ్తున్నదని అమితంగా బాధ పడింది. డాక్టర్ని పిలుచుకొచ్చే లోపలే, ఆమె ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. చిరకాల సుప్తి, చివరికామెను మింగేసిందని, మాధవరావ్ కుమిలిపోయాడు. రాధ భయస్థురాలై, ఓ మూల ఒదిగిపోయింది. అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో కూడ కన్నీళ్ళు నిండాయి. శ్రీమతి మరణించి నెల రోజులు గడిచాయి. మాధవరావ్ సర్వసంగ పరిత్యాగిలా, ఎప్పుడూ ఒంటరిగా ఉండిపోతున్నాడు. రాధ వచ్చినా పులకడు, పలకడు. ఏమి తింటున్నాడో, దప్పిక ఎలా తీర్చుకుంటున్నాడో ఎరుగని వానిలా గడుపుతున్నాడు రాధకు అతనికి చేరువకావాలని వుంది. అతని బ్రతుకు పంచుకోవాలని వుంది



ప్రయాణం — ఎల్. ఆర్. గ్రోవర్ (రోహతక్)

అతనిచేత మూడు ముళ్ళూ వేయించుకోవాలనే ఆతృత దినదినాభివృద్ధి చెందే తరుణంలో కల— వ్యతిరేకమైన, విరుద్ధమైన, భయంకరమైన కలలు చిరకాలపు తన కల—నిజమవబోతున్న తరుణంలో. తనకు నిద్దట్లో భయపెట్టే కలలు!

పగలు తలపోస్తున్న సుందర స్వప్నాలు, సమూలంగా చెరిపేసే భయంకరమైన అగాధపు కలలు! ప్రతిరోజూ కలలో శ్రీమతి వస్తోంది! ఓ మాటు వికృతంగా కోరలు చాచి బలిగొంటున్న పిశాచిలా, మరో మాటు అతి దీనంగా, 'ఎందుకిలాంటి ద్రోహం చేశావ్?' అని అడుగుతున్నట్టుగా.

రోజూ రాత్రి కలలో అలా నిలదీస్తూ, తన సుందర స్వప్నాలను బూడిద చేస్తోంది.

తనలో అలౌకికమైన పాపభీతిని మొలకెత్తిస్తోంది. తనకు లేచినా, కూర్చున్నా చెమటలు పట్టి, వణికిపోయేలా చేస్తోంది.

'శ్రీమతీ! ఎందుకు నన్నిలా వెంటాడుతున్నావు? నన్ను చచ్చి సాధిస్తున్నావా? ప్రాణంతో వున్నప్పుడు ఆ స్థానమివ్వక, ఇప్పుడు అందుకోనివ్వకా సాధిస్తున్నావా? ఇది నీకు న్యాయమేనా? మాధవ్‌ని సుఖపెట్టాలనుకోటం నా నేరమా? చెప్పు. చెప్పు' అని మానసిక రోదన చేసిన రాధకు, మరలా శ్రీమతి కలలో కనబడి యిలా చెప్పింది.

'రాధా! స్త్రీకి ఎంత పెద్ద రోగమొచ్చినా, భర్తతో కలసి బ్రతకాలన్న వాంఛమాత్రం పోదు. మందులతో నా ఆరోగ్యం బాగుపడి, ఎప్పటికైనా నా కాపురం నేను చేసుకోగలననే ఆశే నాకుండదనుకున్నావా? నువ్వు కళ్ళారా చూశావు కూడ—మేము ఒకరి కొకరు ఎంత ప్రేమను పంచుకుంటున్నామో. ఆయన నన్ను ద్వేషిస్తున్నట్టు నాకు మాటమాత్రంగానైనా తెలిసివుంటే, నేనే ఆ విషాన్ని మింగి, ఏనాడో అతన్ని విడిచిపెట్టి వుండేదాన్ని. నాకు చెల్లెలు లాంటి దానివనుకుని నీకు నా ఇంట్లో అంత స్వాతంత్ర్యం ఇచ్చాను. నిన్ను నమ్మాను. ఆదరించాను. కానీ—నువ్వు దాన్ని దుర్వినియోగం చేసుకున్నావు. నిండు ప్రాణాన్ని తీసి, పాపం చుట్టబెట్టుకున్నావు. భార్యాభర్తలను విడదీసి, పాతకిగా మారిపోయావు. నా స్థానాన్ని నువ్వాక్రమించి, నా భర్తని సర్వస్వం పొందాలని చూశావు. కానీ, ఇప్పుడు నీ మనసే నీ కెదురు తిరిగింది. నువ్వు చేసిన పని మంచిదైతే అలా ఎందుకౌతుంది? నువ్వెంత పాపకృత్యం చేశావో నీ మనసే నీకు సాక్ష్యం చెప్పి, నిన్ను నిలవనీయటం లేదు. అకృత్యాలు చేసిన మనిషికి మనస్సాక్షి ఎప్పుడూ సహకరించదు. చివరికి దెబ్బతీయక మానదు. ఆ అవస్థలోనే నువ్వున్నావిప్పుడు. వెళ్ళిపో ఇక్కడ్నుంచి. ఆయన ఇంకెవరినైనా నిర్మల హృదయను వివాహమాడటం నేను సహిస్తాను గానీ, నువ్వు మాత్రం ఆ స్థానం అందుకోటానికి వీల్లేదు. మొండిగా చేశావంటే నే నిలాగే అనుక్షణం నిన్ను వెంటాడుతుంటాను. నీ కప్పుడు పెళ్ళయిందన్న తృప్తిగానీ, సంసారంలో సుఖంగానీ దక్కదు. వెళ్ళిపో, వెళ్ళిపో'' అని వెంటాడి తరిమి కొడుతున్నట్టు కనబడింది శ్రీమతి.

తుళ్ళిపడి లేచి కూర్చున్న రాధ గుండె అదిరిపోయాయి. శరీరంలో అణుఅణువునా భయం ప్రవహిస్తున్నట్టుగా వణికిపోయింది.

'శ్రీమతీ! వద్దు. నన్నిలా భయపెట్టకు. నువ్వు చెప్పినట్టే చేస్తాను. మాధవ్‌ని పొందాలన్న కోరికను నా మనసునుంచి సమూలంగా పెకలించేస్తాను. నన్ను వదలిపెట్టు. నేను పోతాను. వెళ్ళిపోతాను' అంటూ ఆమె పెదవులు వణికాయి. అప్పటికప్పుడే అక్కడ్నుంచి వెళిపోదామంటే, ప్రకృతి గాఢాంధకారంలో ఇమిడి వుంది. అంతా నిశ్శబ్దం. బయటికి రావాలంటే భయం. లోపల వుండాలన్నా భయం. రాధకు పరిస్థితి ఏ రకంగా దిగజారుతుందో అర్థం కాలేదు. ఏడుస్తూ, దిండు నదుముకుని కూర్చుంది.

ఎలాగో తెల్లవారింది. ఒక రోజు కూడ గడిచింది. ఆ రోజు రాధ మాధవ్ దగ్గరకు వెళ్ళాలన్న ఆలోచనే చేయలేదు. చిరుచీకట్లు కమ్ముతున్నప్పుడు రాధ గదిలోకొచ్చిన ప్రక్కవాళ్ళు, ఆ గదంతా ఖాళీగా ఉండటం గమనించి విస్తుపోయారు. ఏమైందంటె? ఏమైందని? అంతు చిక్కని ఆలోచనల్లో తేలిందేమీ లేదు.

రాధ ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. ఏమైందో తెలియదు. అనంతమైన ఈ విశ్వంలో సంభవించే ఎన్నింటి సంఖ్యతో రాధని చేర్చుకున్నా కూడా తప్పు లేదేమో! ✻